నేడు ఉచిత వైద్య శిబిరం

జగద్గిరిగుట్ట: పద్మానగర్ కాలనీ, రోడ్డు నంబర్ 5లో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రాణదార హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు క్యాంప్ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

మహనీయుల స్ఫూర్తిని కొనసాగించాలి

సుభాష్‌నగర్: సూరారం కాలనీ తెలుగుతల్లి నగర్‌లో శనివారం మహనీయులు ఉత్సవాలు నిర్వహించారు. మాజీ కార్పొరేటర్ సురేష్‌రెడ్డి మహనీయుల విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజల హక్కుల కోసం పోరాడిన మహనీయుల వారసత్వాన్ని, ఆలోచనలను ముందుకు తీసుకెళ్లాలన్నారు. కార్యక్రమంలో శ్రీకాంత్, భాస్కర్, శివాజీ, రాజుగౌడ్, జహంగీర్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయంలో అన్నదానం



జగద్గిరిగుట్ట: హనుమాన్ అన్నప్రసాద సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో చింతల్, శ్రీసాయి కాలనీలో అభయ అంజనేయ, పోచమ్మ అమ్మవారి ఆలయంలో శనివారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఉదయం అమ్మవారికి, అభయ ఆంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు చేశారు.

ఉచిత మెడికల్ క్యాంప్

ఆలయ ప్రాంగణంలో శనివారం ఉచిత మెడికల్ క్యాంప్ నిర్వహించారు. లయన్స్ క్లబ్, చింతల్ ఆధ్వర్యంలో నెక్స్ట్‌జెన్ హాస్పిటల్ సౌజన్యంతో డయాబెటిక్ పరీక్షలు, మెడివిజన్ ఐ హాస్పిటల్ ఆధ్వర్యంలో కంటి పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి మందులను పంపిణీ చేశారు.

ప్రజలకు సరిపడా నీటిని సరఫరా చేయాలి

నిజాంపేట్: కార్పొరేషన్ ప్రజలకు అవసరమైన స్థాయిలో నీటిని సరఫరా చేయాలని ఆకుల్ సతీష్ కోరారు. శనివారం నిజాంపేట్ కార్పొరేషన్‌లో నీటి సమస్యను తీర్చాలని, గోదావరి నీళ్ల మంజూరయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని వాటర్‌వర్క్స్ డీజీఎంను కలిసి కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మంచినీటి సమస్యపై పలుమార్లు ఫిర్యాదులు, ధర్నాలు చేస్తున్న ఆధికారులు చర్యలు తీసుకోలేదన్నారు. రాజీవ్‌గాంధీ నగర్, రాజీవ్ గృహకల్ప, సాయినగర్, ఇంద్రన్న కాలనీ, ఎన్టీఆర్ తదితర కాలనీల్లో 15 రోజులకి ఒకసారి మాత్రమే తాగునీరు సరఫరా చేస్తున్నారని, దీని వల్ల ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. కార్యక్రమంలో అమలేశ్వరి, అరుణ్ రావు, చందు, ఎల్లస్వామి, హనుమయ్య, సుధాకర్‌రెడ్డి, ప్రతాప్ పాల్గొన్నారు.

నేరాల అదుపునకు కెమెరాలు దోహదం



జగద్గిరిగుట్ట: నేరాల అదుపునకు సీసీ కెమెరాలు దోహదపడతాయని బాలానగర్ జోన్ డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ సురేష్‌కుమార్ అన్నారు. శనివారం జగద్గిరిగుట్ట పోలీస్ స్టేషన్ పరిధిలోని పాపిరెడ్డి కాలనీలో 70 సీసీ కెమెరాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు.

తల్లిదండ్రులకు బాలుడి అప్పగింత



నిజాంపేట్: తప్పిపోయిన బాలుడిని పోలీసులు తల్లిదండ్రులకు అప్పగించారు. పోలీసుల వివరాల ప్రకారం.. బాచుపల్లి గ్రామం ఖాజీపల్లిలో నివాసం ఉంటున్న మాదేరిమెట్ల హర్షవర్ధన్ అనే బాలుడు రోడ్ల వెంట తిరుగుతున్నాడు. బాచుపల్లి పోలీసులు పెట్రోలింగ్ నిర్వహిస్తున్న సమయంలో గమనించి స్టేషన్‌కు తీసుకువచ్చారు. బాలుడు తెలిపిన వివరాల ఆధారంగా పోలీసులు అతని తల్లిదండ్రులకు అప్పగించారు.

రజతోత్సవ సభకు తరలాలి

కూకట్‌పల్లి: తెలంగాణ ఆత్మ గౌరవ నినాదమైన ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించిన బీఆర్‌ఎస్ రజతోత్సవ పండుగకు ఉవ్వెత్తున్న తరలిరావాలని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు పిలుపునిచ్చారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో ఏర్పడిన తెలంగాణ రాష్ట్ర సమితి అసాధ్యం అనుకున్న తెలంగాణ రాష్ట్ర సాధనను సుసాధ్యం చేసి దేశంలోనే అన్ని రంగాల్లో అగ్రగామి రాష్ట్రంగా తీర్చిదిద్దారని అన్నారు.


స్కాన్‌తో స్టేషన్ సమాచారం

వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన జీడిమెట్ల ఇన్‌స్పెక్టర్

జీడిమెట్ల: ఆలోచన ఒక్కరిదే.. ఉపయోగం చాలా మందికి. మారుతున్న సమాజానికి తగినట్లుగా మనమూ మారాలి. మనం ఇచ్చే సమాచారం పది మందికి ఉపయోగపడాలి. మన ఆలోచన నూతన టెక్నాలజీకి అనుగుణంగా ఉండాలి అని జీడిమెట్ల ఇన్‌స్పెక్టర్ గడ్డం మల్లేష్ వినూత్నంగా ఆలోచించారు. ఎక్కడైనా ప్రమాదం జరిగినప్పుడు ఆ ప్రాంతం ఏ స్టేషన్ పరిధిలోకి వస్తుందో తెలియక చాలా మంది ఇబ్బందులు పడుతున్నారు. అటు, ఇటు తెరిగి సమయాన్ని వృథా చేస్తున్నారు. ఇలా ఇబ్బందులు రావద్దని ఒక్క క్యూఆర్ కోడ్ స్కానర్‌తో స్టేషన్ పరిధి సమాచారం, పోలీసుల ఫోన్ నంబర్ తెలిసేలా జీడిమెట్ల స్టేషన్ పరిధిలో బోర్డులు ఏర్పాటు చేశారు. బోర్డుపై ఉన్న క్యూఆర్ స్కానర్‌ను గూగుల్ ద్వారా స్కాన్ చేసి ఓపెన్ చేయగానే సదరు పీఎస్ మ్యాప్‌తో పాటు పరిధి, ఇన్‌స్పెక్టర్, ఎస్‌ఐల వివరాల సమాచారం వస్తుంది. ఇన్‌స్పెక్టర్ ఆలోచన చాలా బాగుందని పలువురు సంతోషం వ్యక్తం చేశారు.



కొత్తగా ఏర్పాటు చేసిన స్కానర్‌ను చూపుతున్న ఇన్‌స్పెక్టర్ మల్లేష్



క్యూఆర్ కోడ్ స్కాన్ చేయగానే వచ్చే మ్యాటర్, మ్యాప్

పైఅధికారుల సహకారంతో..



పబ్లిక్ సర్వీస్ సెక్టార్‌లో కాబట్టి ప్రజలకు ఉపయోగపడేలా నా ఆలోచనలు ఉంటాయి. ప్రజలు ఏదైనా ప్రమాదంలో చిక్కుకున్నప్పుడు మొదటగా పోలీసులకు ఫోన్ చేయాలని భావిస్తారు. అలాంటప్పుడు వారు ఏ పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్నారో క్యూఆర్‌కోడ్ ద్వారా వివరాలు తెలుసుకునేలా రూపొందించాను. దీని ద్వారా సంబంధిత ఇన్‌స్పెక్టర్‌కు నేరుగా ఫోన్ చేయవచ్చు. పైఅధికారుల సహకారంతోనే నేను ప్రజలకు ఉపయోగపడే పనులు చేస్తున్నాను. అధికారులు సైతం నన్ను ప్రోత్సహించడం సంతోషంగా ఉంది.

– గడ్డం మల్లేష్, జీడిమెట్ల ఇన్‌స్పెక్టర్

చాలా ఉపయోగం



జీడిమెట్ల పోలీసులు మా ప్రాంతంలో ఏర్పాటు చేసిన క్యూఆర్ కోడ్‌ను గూగుల్ ద్వారా స్కాన్ చేశాను. వెంటనే సెల్‌ఫోన్‌లో పీఎస్ మ్యాప్‌తో పాటు పోలీసుల వివరాలు వచ్చాయి. ఇది మాలాంటి వారికి ఎంతగానో ఉపయోగపడుతుంది. ప్రభుత్వం ఇదే ఆలోచనతో ప్రతి పీఎస్ పరిధిలో ఇలాంటి క్యూఆర్‌కోడ్‌లతో కూడిన బోర్డులను ఏర్పాటు చేయాలి.

– శ్రీజ, ప్రైవేట్ ఉద్యోగిని

నీటి సమస్యను పరిష్కరించాలని వినతి

దుండిగల్: దుండిగల్ గ్రామంలో నెలకొన్న నీటి సమస్యని పరిష్కరించాలని స్థానిక నేతలు కోరారు. ఈ మేరకు గండిమైసమ్మలోని మున్సిపల్ కార్యాలయంలో శనివారం కమిషనర్ వెంకటేశ్వర్ నాయక్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. గ్రామంలో వారానికి ఒక సారి మాత్రమే నీటి సరఫరా అవుతుందని, అది కూడా గంట మాత్రమే వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. వేసవి కాలంలో నీటి కోసం ఇబ్బందులు పడాల్సి వస్తుందన్నారు. నీటికి అధికంగా రుసుము వసూలు చేస్తున్నారని కమిషనర్ దృష్టికి తెచ్చారు. దీనిపై స్పందించిన ఆయన నీటి సమస్య పరిష్కరించే విధంగా చర్యలు చేడతామని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్‌ల ఫోరం మండల మాజీ అధ్యక్షుడు కావలి గణేష్, మాజీ కౌన్సిలర్ అమరం గోపాల్ రెడ్డి, నాయకులు తురాయి పాండుగౌడ్, దొంతి మహేష్, జక్కుల గోపాల్ యాదవ్, ఉప్పరి కృష్ణ, వేణుగోపాల్, వాపుల శ్రీనివాస్, తక్కడ కృష్ణ పాల్గొన్నారు.



కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఫ్లెక్సీలు తొలగించడం సరికాదు



ఉప కమిషనర్‌కి వినతిపత్రం అందజేస్తున్న బీఆర్‌ఎస్ నేతలు

కుత్బుల్లాపూర్: బీఆర్‌ఎస్ రజతోత్సవ వేడుకల సందర్భంగా నాయకులు, కార్యకర్తలు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను తొలగించడం సరికాదని నాయకులు అన్నారు. శనివారం ర్యాలీగా వెళ్లి కుత్బుల్లాపూర్, గాజులరామారం సర్కిళ్ల ఉప కమిషనర్లకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. కొందరు అధికారులు అధికార పార్టీకి చెందిన నాయకుల మాటలు విని అత్యుత్సాహంతో ఫ్లెక్సీలు చింపివేయడం, తొలగించడం లాంటి చేశారన్నారు. కార్యక్రమంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గ యూత్ అధ్యక్షులు దూదిమెట్ల సోమేష్ యాదవ్, డివిజన్ అధ్యక్షులు రుద్ర అశోక్, ఎర్వ శంకరయ్య, పుప్పాల భాస్కర్, పోలే శ్రీకాంత్, సీనియర్ నాయకులు సంపత్ మాధవరెడ్డి, అడ్వకేట్ కమలాకర్, గుమ్మడి మధుసూదన్ రాజు, గుబ్బల లక్ష్మీనారాయణ, నదీమ్ రాయ్, ఫిరోజ్, నరేందర్ రెడ్డి, బ్రహ్మానందచారి, బసవేశ్వర్, జయ కృష్ణ, యేసు, ఇస్మాయిల్, చిన్నా చౌదరి తదితరులు పాల్గొన్నారు.

ఉగ్రదాడి.. నిరసనల వెల్లువ



కొవ్వొత్తులతో నిరసన ప్రదర్శనలో పాల్గొన్న స్థానికులు

మృతులకు ఘన నివాళి

రంగారెడ్డినగర్: పర్యాటకులపై ఉగ్రదాడిని ఖండిస్తూ సూరారం డివిజన్ బీజేపీ నాయకుల ఆధ్వర్యంలో శనివారం రాత్రి షాపూర్‌నగర్ మార్కెట్‌లో క్యాండిల్ ర్యాలీ నిర్వహించారు. ఉగ్రవాదులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు సురేష్‌గౌడ్, మహిళా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నిజాంపేట్ : పహల్గామ్ పర్యాటకులపై జరిగిన దాడికి నిరసనగా శనివారం జీడిమెట్ల డివిజన్ కృష్ణ కుంజ్ గార్డెన్స్‌లో స్థానికులు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఉగ్రవాదుల దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. దాడిలో మృతి చెందిన పర్యాటకులకు నివాళులర్పించారు. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని, బాధితులకు త్వరగా న్యాయం జరగాలని ఆకాంక్షించారు.

అఖిల భారత దళిత సేన ఆధ్వర్యంలో..

సుభాష్‌నగర్: అఖిల భారత దళిత సేన ఆధ్వర్యంలో శనివారం రాత్రి మహదేవపురంలో క్యాండిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థ అధ్యక్షుడు రాజు మాట్లాడుతూ.. ఇది యాత్రికులపై దాడి మాత్రమే కాదని, భారతదేశంపై దాడి అని పేర్కొన్నారు. అదే విధంగా మైనార్టీ అధ్యక్షుడు సయ్యద్ జహంగీర్ ఆధ్వర్యంలో రోడామేస్త్రీనగర్‌లో ర్యాలీ నిర్వహించారు.



మహదేవపురం క్యాండిల్ ర్యాలీలో పాల్గొన్న ప్రజలు



షాపూర్‌నగర్ మార్కెట్‌లో క్యాండిల్ ర్యాలీ నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం స్వాధీనం

కుత్బుల్లాపూర్: గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైన ఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. కొంపల్లిలోని కీర్తిరెడ్డి బాయ్స్ హాస్టల్ ఎదురుగా ఉన్న ఖాళీ ప్రదేశంలో శనివారం ఉదయం ఓ వ్యక్తి మృతదేహం ఉందని స్థానికుల ద్వారా పోలీసులు సమాచారం అందింది. వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు శవ పంచనామా నిర్వహించారు. సదరు వ్యక్తి వయస్సు 55 సంవత్సరాల వరకు ఉంటుందని, గ్రీన్ కలర్ టీషర్ట్, బ్లాక్ కలర్ ప్యాంటు ధరించి ఉన్నాడని, అతనికి సంబంధించి ఎటువంటి ఆధారాలు లభ్యం కాలేదని తెలిపారు. ఈ మేరకు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. అనారోగ్య కారణాలతో మృతి చెంది ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఉపాధ్యాయుల పాత్ర కీలకం



సర్టిఫికెట్లతో యూకేజీ విద్యార్థులు



మెడల్స్ తీసుకున్న విద్యార్థులతో సీఐ మల్లేష్

జీడిమెట్ల: విద్యార్థుల భవిష్యత్‌ను తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలమకని ఇన్‌స్పెక్టర్ గడ్డం మల్లేష్ అన్నారు. శనివారం సుభాష్‌నగర్‌లోని బోధి వృక్ష ఒలంపియాడ్ స్కూల్‌లో నిర్వహించిన గ్రాడ్యుయేషన్‌డే, అకాడమిక్ ఎక్సలెన్సీ అవార్డుల కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థి జీవితంలో పాఠశాల నుంచి వచ్చే చిన్న బహుమతి అయినా అది చాలా గొప్పదని అన్నారు. స్పోర్ట్స్‌డే సందర్భంగా పాఠశాలలో నిర్వహించిన ఇండోర్ గేమ్స్‌లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్లు భార్గవిరెడ్డి, వెంకటరెడ్డి, ప్రిన్సిపాల్ సీ.హెచ్.మహేందర్‌రెడ్డి, ఉపాధ్యాయులు శిరీష, రాధిక, శ్రీజ, భవాని, గోదావరి, హర్షవర్ధన్‌రెడ్డి, రాధిక తదితరులు పాల్గొన్నారు.

ఎస్పీఆర్ ఆధ్వర్యంలో వేసవి శిబిరాలు

సుభాష్‌నగర్: ఎస్పీఆర్ చారిటబుల్ ట్రస్ట్, ఎస్పీఆర్ గ్లోబెల్ స్కూళ్ల ఆధ్వర్యంలో విద్యార్థులకు వేసవి శిక్షణా శిబిరాలు నిర్వహిస్తున్నట్లు సంస్థ చైర్మన్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి సొంటిరెడ్డి పున్నారెడ్డి శనివారం తెలిపారు. మే 1వ తేదీ నుంచి శిబిరంలో కర్రసాము అబాకస్, స్పోకెన్ ఇంగ్లిష్ , ఫ్యాబ్రిక్ పెయింటింగ్, హ్యాండ్ రైటింగ్ తదితర కోర్సుల్లో ఉచితంగా శిక్షణ ఇస్తామని, విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఔత్సాహికులు 7997995252 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య



నాగదుర్గాస్వామి (ఫైల్)

కుత్బుల్లాపూర్: ఆర్థిక ఇబ్బందులతో ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. కుత్బుల్లాపూర్ విమానపురి కాలనీకి చెందిన నాగదుర్గాస్వామి(40) జొమాటోలో డెలివరీ బాయ్‌గా పనిచేస్తున్నాడు. ఈ నెల 25న ఉదయం 8 గంటలకు డెలివరీ చేసేందుకు బైక్‌పై వెళ్లిన అతను ఇంటికి తిరిగి రాలేదు. అతని మొబైల్‌కు భార్య నాగలక్ష్మి ఎన్నిసార్లు కాల్ చేసినా సమాధానం ఇవ్వలేదు. కాగా శనివారం బొల్లారం రోడ్డులోని ఓ చెట్టుకు ఉరి వేసుకుని కనిపించాడు. ఆర్థిక ఇబ్బందులతోనే ఆత్మహత్య చేసుకున్నాడని మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పీహెచ్‌డీ అడ్మిషన్లలో అవకతవకలు

నిజాంపేట్: పీహెచ్‌డీ అడ్మిషన్లను డబ్బులకు అమ్ముకుంటున్నారని మాదిగ జర్నలిస్టు ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎర్ర యాకన్న ఆరోపించారు. శనివారం ఆయన మాట్లాడుతూ.. తెలుగు యూనివర్సిటీ రిజిస్ట్రార్, అడ్మిషన్స్ డైరెక్టర్‌లపై చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ఎర్ర యాకయ్యకు 57 మార్కులు రాగ.. ఒకే సామాజిక వర్గానికి చెందిన వ్యక్తికి తనకంటే తక్కువ 56 మార్కులు వచ్చినవారికి ఏ విధంగా పీహెచ్‌డీ అడ్మిషన్స్ ఇస్తారని ప్రశ్నించారు. విశ్వవిద్యాలయంలో డబ్బులకు అమ్ముడుపోయి పీహెచ్‌డీ సీట్లను అమ్ముకుంటున్న అడ్మిషన్ డైరెక్టర్‌పై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు.

చౌరస్తా విస్తరణ పనుల పరిశీలన

సుభాష్‌నగర్: నాలుగు రోడ్లను కలిపే గాజులరామారం చౌరస్తాలో ట్రాఫిక్ సమస్యలు తొలగిపోనున్నాయని జీడిమెట్ల ట్రాఫిక్ సీఐ శ్రీనివాస్ అన్నారు. గాజురామారం చౌరస్తా రోడ్డు విస్తరణ పనులను శనివారం జీహెచ్‌ఎంసీ ఈఈ కిష్టప్ప, డీఈ రూపాదేవి, ఏఈ తిరుపతితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఇప్పటికే 70 శాతం మేర పనులు పూర్తయ్యాయని, మిగతా పనులను మూడు వారాల్లో పూర్తి చేసి అందుబాటులోకి తెస్తామని తెలిపారు.



పనులను జీహెచ్‌ఎంసీ అధికారులతో పరిశీలిస్తున్న ట్రాఫిక్ సీఐ శ్రీనివాస్

చెత్తకు నిప్పు!

రంగారెడ్డినగర్: బహిరంగ ప్రదేశాలు, ఖాళీ ప్రదేశాల్లో చెత్తను నిప్పు పెడితే కఠిన చర్యలు తప్పవని ఓ వైపు అధికారులు హెచ్చరికలు జారీ చేస్తున్నా అవి కొనసాగుతూనే ఉన్నాయి.. శనివారం సాయంత్రం చింతల్- షాపూర్‌నగర్ రోడ్డులోని హెచ్‌ఎంటీ ఖాళీ ప్రదేశంలో గుర్తు తెలియని వ్యక్తులు చెత్తకు నిప్పు పెట్టారు. దీంతో మంటలు ఎగిసిపడి పొగలు వ్యాపించాయి. హెచ్‌ఎంటీ స్థలంలో అనుమతి లేకుండా చెత్తను పారబోసి నిప్పు పెట్టడంతో పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు చెత్త వేయకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



ప్రమాదకరంగా రోడ్డు!



నిజాంపేట్ : ప్రగతి నగర్ విజేత సూపర్ మార్కెట్ వద్ద రోడ్డు ప్రమాదకరంగా మారింది. ప్రతిరోజు ఒకరిద్దరూ వాహనదారులు ప్రమాదాలకు గురై గాయాల పాలవుతున్నారు. పైప్‌లైన్ మరమ్మతుల కోసం రోడ్డును తవ్విన అధికారులు పూర్తిస్థాయిలో మరమ్మతులు చేయడం మరిచారు. ఇది ప్రయాణికులకు శాపంగా మారింది. దీంతో తరచు ప్రమాదాలు జరుగుతున్నాయి. రోడ్డు మధ్యలో ఒక్కసారిగా ఎగుడు దిగుడుగా ఉండడంతో వాహనదారులు గుర్తించక స్పీడ్‌లో అదుపు తప్పుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వెంటనే రోడ్డు మరమ్మతులు చేసి ప్రమాదాలను నివారించాలని వాహనదారులు, స్థానికులు కోరుతున్నారు.

భూ భారతితో రెవెన్యూ సమస్యలు పరిష్కారం

జిల్లా కలెక్టర్ గౌతంకుమార్

సుభాష్‌నగర్: భూభారతి చట్టం ద్వారా రెవెన్యూ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని జిల్లా కలెక్టర్ గౌతం కుమార్ అన్నారు. శనివారం దుండిగల్ మండలం బహుదూర్‌పల్లిలో మేకల వెంకటేశం ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గ్రామాల్లో రెవెన్యూ అధికారులు నిర్వహించే రెవెన్యూ సదస్సుల్లో మీరు దరఖాస్తులు ఇస్తే వాటికి శాశ్వత, సత్వర పరిష్కారం ఉంటుందన్నారు. భూభారతి పరిధిలో లేని సమస్యలకు తగు సూచనలు రెవెన్యూ అధికారులు ఇస్తారని అన్నారు. రైతులకు, ప్రజలకు ఉపయోగపడేలా అన్ని చట్టాలను కలిపి సింగిల్ రెవెన్యూ చట్టం త్వరలోనే తేవడం జరుగుతుందన్నారు. రెవెన్యూ, జీహెచ్‌ఎంసీ, హెచ్‌ఎండీఏ, హైడ్రా అన్ని శాఖల సమన్వయంతో ఎన్‌క్రోచ్‌మెంట్ సమస్యల పై కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు. అనంతరం అదనపు కలెక్టర్ మాట్లాడారు.



సదస్సుకు హాజరైన రైతులు



సదస్సులో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ గౌతం కుమార్

మా భూమిని ఇప్పించండి

'తాతల నాటి నుంచి వారసత్వంగా వస్తున్న భూమి మొన్నటి వరకు నా కొడుకు పేరు పైన పట్టా ఉంది. కొన్ని సంవత్సరాలుగా రైతుబంధు డబ్బులు కూడా పడ్డాయి. ఉన్నట్టుండి ఐదు నెలల క్రితం మా ఏడు గుంటల స్థలం మరో ఇద్దరి పేర్ల మీదకి మారింది. అధికారుల చుట్టూ కాళ్లు అరిగేలా తిరిగినా సమస్య పరిష్కారం కాలేదు. సొంత ఇల్లు కూడా లేదు' అని దుండిగల్‌కు చెందిన ముడిమేల లలిత కలెక్టర్ ముందు తమ బాధను వెళ్లగక్కుతూ కన్నీరు పెట్టింది. ఇంతలో కలెక్టర్ జోక్యం చేసుకొని.. వీరి సమస్యను తక్షణమే పరిష్కరించాలని మల్కాజిగిరి ఆర్డీఓను ఆదేశించారు. ఇలా మండలంలోని పలు గ్రామాలకు చెందిన రైతులు తమ సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. సదస్సులో జిల్లా అగ్రికల్చర్ మార్కెట్ కమిటీ చైర్మన్ నర్సింహులు, గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, మల్కాజిగిరి ఆర్డీఓ శ్యాంప్రకాష్, దుండిగల్ తహసీల్దారు మతిన్, రెవెన్యూ అధికారులు, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

